క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మూలపేటలో జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామివార్లకు ఊయల సేవ

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూలపేటలో వేంచేసిన జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలతో పాటు కొండెవరంలో వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు చేశారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రేపు సామూహిక అభిషేకాలు

సామర్లకోట: స్థానిక అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో ఉన్న లక్ష్మీదేవికి మంగళవారం సామూహిక అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు రఘు తెలిపారు. లక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకొని తెల్లవారు జామున స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు అనంతరం సామూహిక అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

9 నుంచి డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈనెల 9వ తేదీ నుంచి తొమ్మిది జిల్లాలోని డ్వామా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఈసీటీ మేనేజరు పి.శ్రీనివాసు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు, కాకినాడ, కోనసీమ, పార్వతిపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం జిల్లాలోని డ్వామా ఏపీడీ ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామన్నారు. తొమ్మిది జిల్లాలో 352 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 79 మందికి శిక్షణ మొదటి బ్యాచ్‌లో పూర్తయిందని తెలిపారు. 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రెండో బ్యాచ్, 13 నుంచి 15వ తేదీ వరకూ మూడో బ్యాచ్, 16 నుంచి 18వ తేదీ వరకు నాలుగో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందస్తామని తెలిపారు.

14న జాబ్ మేళా

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 14న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర నాయుడు ఆదివారం తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 30 రోజుల పాటు శిక్షణ ఉద్యోగం కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన 19 నుంచి 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ సెల్ నంబర్‌కు 83283 98875ను సంప్రదించాలని సూచించారు.

విజిలెన్స్ తనిఖీలు

ఏలేశ్వరం: నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని ధర్మవరం, యర్రవరం గ్రామాల్లో చికెన్, మటన్, చేపల దుకాణాలపై ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేశారు. రీజినల్ విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని ఆరు షాపుల్లో తనిఖీలు చేయగా ఒక షాపులో కేజీకి వంద గ్రాములు తూకం తేడా రాగా రెండు షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గుర్తించి మూడు షాపులపై కేసులు నమోదు చేశారు. యర్రవరంలో నాలుగు షాపుల్లో తనిఖీలు చేయగా రెండుషాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గుర్తించి రెండు షాపులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కానిస్టేబుల్స్ ఈశ్వరరావు, లోవకుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ



సామర్లకోట ఆసుపత్రిలో దాసుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆశాజ్యోతి

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామానికి చెందిన రేగెల్లి దాసు అనారోగ్యంతో సామర్లకోట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు గ్రామ వలంటీర్ సరిగోలు ఆశాజ్యోతి గ్రామ సచివాలయం–2 కార్యదర్శి ఎల్.రాధాకృష్ణ సూచనల మేరకు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. ఆమెను సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపీడీఓ హిమ మహేశ్వరి, ఈఓపీఆర్‌డీ నక్కా సత్యనారాయణమూర్తి అభినందించారు.

ఆక్రమణలో ప్రభుత్వ స్థలాలు

- జాతీయ రహదారిలో పెరిగిపోతున్న అక్రమాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పంద్రవాడ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

సామర్లకోట: జాతీయ రహదారి 216 వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఎంతో ఖరీదైన స్థలాలను ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంద్రవాడ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విషయం తెలిసి కూడా పంచాయతీ కార్యదర్శి, పాలక మండలి సభ్యులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదులు చేశామని ఆ గ్రామానికి చెందిన పలువురు తెలియజేస్తున్నారు. ఇళ్ల లేని నిరుపేదలు ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి భూములను సేకరణ చేసి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా రుణాలు ఇస్తోంది. అయితే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలకు వచ్చిన వారే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం ఎంత వరకు సమంజసమనే వాదనలు ఉన్నాయి. సామర్లకోటలో బ్రౌన్‌పేట, స్టేషన్ సెంటర్ కూడా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయం పంచాయతీ అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తే ఆ నోటీసు ఆధారంగా కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందనే విమర్శలు ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం

పంద్రవాడ పంచాయతీ పరిధిలో పంచాయతీ సామాజిక స్థలం ఆక్రమణను గుర్తించాం. ఆక్రమణదారునకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరైంది. ఆక్రమణదారునకు పనులు తక్షణం నిలుపుదల చేయాలని నోటీసులు ఇచ్చాం. పంచాయతీ చట్టం 1994 అనుసరించి సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. అయినా పనులు కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలియజేశాం.

– జీవీ రమణ, పంచాయతీ కార్యదర్శి, పంద్రవాడ

ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలి

పంద్రవాడలో ఎంతో విలువైన స్థలం ఆక్రమణకు గురవుతోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో జిల్లా కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించలేదు. పంచాయతీ అధికారుల చర్యలు తీసుకోవాలి.

– గీసాల శ్రీనివాసు, ఆటోడ్రైవరు, పంద్రవాడ

పురుహూతికా అమ్మవారికి బంగారు నెక్లెస్ సమర్పణ



పురుహూతికా అమ్మవారికి బంగారు నెక్లెస్ సమర్పిస్తున్న భక్తులు

పిఠాపురం: అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠమైన పిఠాపురం పురుహూతికా అమ్మవారికి భక్తులు బంగారు నక్లెస్‌ను ఆదివారం సమర్పించారు. పిఠాపురానికి చెందిన దంగేటి నాగేశ్వరరావు, మహాలక్ష్మి దంపతులు రూ.50 వేల విలువైన 10.550 గ్రాముల బంగారు నక్లెస్‌ను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నక్లెస్‌ను అలంకరించారు. పలువులు ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50 పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాలు నుంచి ప్రముఖ డిజైనర్లు చేసిన డిజైన్లను నగర ప్రజలకు పరిచయం చేసినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన మంగళవారం రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉమ్మడి కుటుంబంతోనే మహిళలకు గౌరవం



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణకు సత్కారం

- మహిళా దినోత్సవంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: ఉమ్మడి కుటుంబాలతోనే మహిళలకు గౌరవం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పేర్కొన్నారు. మదర్‌థెరిస్సా వలంటరీ ఆర్గనేషన్ అధినేత జి.రాజు మాస్టారు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను చైతన్యం చేయడానికి రాజు మాస్టారు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మహిళ అత్త అవుతుందనే విషయాన్ని గమనించి అత్తమామలను గౌరవించాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత ప్రగతి సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లోను మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించారని తెలిపారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత మాట్లాడుతూ మహిళలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఇంట్లో పని చేసే మహిళకు కూడా గుర్తింపు రావాలన్నారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రగతి సాధించాలన్నారు. మహిళలపై పాట పాడి సుబ్బారావు అలరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గులు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ గోకిన సునేత్రదేవి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, నవర హైస్కూల్ హెచ్‌ఎం బి.అన్నపూర్ణ, లయన్స్ క్లబ్ మహిళా ప్రతినిధులు సింగవరపు సుధా రాణి, చిత్తూలూరి శ్రీదేవి, ఈదల మంగాదేవి, మహిళా డాక్టర్లు, ఉపాధ్యాయిని ఏఎల్‌వీ కుమారి, అంగన్ వాడీ టీచరు ఎంవీ శ్రీలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్‌కు దీటుగా మదర్‌థెరిస్సా వలంటరీ అధినేత రాజు మాస్టారు సేవలు చేయడంతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజు మాస్టారును సన్మానించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ న్యాయనిర్ణయేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, సినీదర్శకుడు ఆనంద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చిత్తూలూరి వీర్రాజు, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



కొండంత అండ నాటికలో ఓ సన్నివేశం



కబ్జా నాటికలో ఓ సన్నివేశం

- అలరించిన కొండంత అండ, కబ్జా నాటికలు

కొత్తపల్లి: కొండెవరంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను ప్రారంభించారు. తొలిరోజు ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఇంజనంపాడుకు చెందిన స్నేహ ఆర్ట్స్ వారితో కొండంత అండ, వెంకటాద్రి హేచరీ అధినేత తెలగంశెట్టి వెంకటేశ్వరావు ఆర్థిక సహాయంతో తొలి తిరుపతికి చెందిన శృంగారవల్లభ ఆర్ట్స్ వారితో కబ్జా నాటికలను ప్రదర్శించారు.

తొలి ప్రదర్శనగా కొండంత అండ

పంటకు పట్టిన చీడపీడలను వదిలించుకోవడం రైతుల బాధ్యత. ప్రకృతి వైపరీత్యాలు, కష్టాలు సంభవించినప్పుడు ఎదురొడ్డి పోరాడుతూ ప్రకృతి సమతుల్యాన్ని కాపాడడంతో పాటు స్వార్థ పూరిత మనస్తత్వాలను సరిచేసుకుంటూ తోటివారికి తోడు, నీడలా ఉండడమే జీవిత పరమార్థమని నమ్మిన ఓ రైతు కథ కొండంత అండ. ఈ నాటికలో కళాకారులు జి.సాంబశివరావు, ఎస్‌బీ చినఆదాం షఫీ, నెమలికంటి వెంకటరమణ, వెనిగడ్ల మధు, వి.గోపాల్‌రెడ్డి, మనోహర్ నటించారు.

ఆకట్టుకున్న కబ్జా

దేశాన్ని ఆక్రమిస్తే దురాక్రమణ. మనిషి మరో మనిషిని దోచుకుంటే దోపిడీ, స్థలాలను ఆక్రమిస్తే ఆక్రమణ అనే వృత్తాంతంతో సాగే కబ్జా నాటిక ప్రేక్షకులను అలరించింది. సమాజంలో న్యాయం, ధర్మం, చట్టాలను అతిక్రమించి స్థలాలు ఏ విధంగా కబ్జాకు గురవుతున్నాయనే సన్నివేశాలను కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. నటులుగా మాధవి, కె.కాశీ, వై.వాసు, శ్రీరామ సత్యనారాయణ నటించారు.

కళల ఐక్యతకు సకల కళా సమాఖ్య



సకల కళా సమాఖ్య నూతన కార్యవర్గం

సామర్లకోట: దేశంలో ఉన్న అన్ని కళలను ఏకతాటి పైకి తీసుకురావడానికి సకల కళా సమాఖ్య ఏర్పాటు చేసినట్టు సినీ దర్శకుడు, నిర్మాత కేబీ ఆనంద్ తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని వివిధ రంగాలకు చెందిన కళాకారులతో కలిపి సకల కళా సమాఖ్యను ఏర్పాటు చేశారు. దీనికి ఆనంద్ గౌరవ సలహాదారుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ తన స్వస్థలమైన సామర్లకోట కళాకారులకు నిలయం కావడంతో వారికి గుర్తింపు తీసుకురావాలని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తోలుబొమ్మలాట, రంగస్థలం, భజన, వీరభద్రుని నృత్యం, కోలాటం వంటి ప్రాచీన కళలతో పాటు గానం, కూచిపూడి, భరతనాట్యం వంటి అన్ని కళలను సమాఖ్య ద్వారా గుర్తింపు తీసుకువస్తామని చెప్పారు. ఉగాది సందర్భంగా పట్టణంలో నాటిక పోటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 1987లో సకల కళాసమాఖ్య ఏర్పాటు చేయగా అనివార్య కారణాల వలన అది అలా ఉండిపోవడంతో నూతన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

సమాఖ్య అధ్యక్షుడిగా బాబీ

సకల కళా సమాఖ్య అధ్యక్షుడిగా బడుగు బాబీ, గౌరవ అధ్యక్షుడిగా దవులూరి సుబ్బారావు, సలహాదారుడిగా కేబీ ఆనంద్, ఉపాధ్యక్షులుగా కేతినీడి శ్రీనివాసరావు, మార్ని రాంబాబు, కార్యదర్శిగా డి.రాజుమాస్టారు, కోశాధికారిగా అలమండ ప్రసాద్, సహాయ కార్యదర్శిగా బొడ్డు రామారావు, న్యాయ సలహాదారుగా కొర్లమండ వీరభద్రరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కాపుగంటి పైడిరత్నం, గంధం రామకృష్ణ, గిడుతూరి శ్రీనివాస రావు, ఆకుల సూర్యనారాయణ, పాలిశెట్టి రాజేష్, కురుకూరి సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

చెందుర్తిలో రెండు వర్గాల మధ్య వివాదం

- పెద్ద చెరువు విషయంలో గొడవ
- పోలీసులు, రెవెన్యూ అధికారుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉన్న పెద్ద చెరువుపై తమకు హక్కు ఉందని రెండు వర్గాలు వివాదానికి దిగడంతో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసు, రెవెన్యూ అధికారులు చెరువు వద్దకు వెళ్లి ఇరు వర్గాలను నిలువరించారు. వివరాల్లోకి వెళితే.. చెందుర్తి సర్వే నంబర్ 234లో 92 ఎకరాల వ్యవసాయ చెరువు ఉంది. ఈ చెరువుపై ఆధారపడి సుమారు 500 ఎకరాల్లో రైతులు పంటలు పండించుకుంటున్నారు. దీనిలో చెందుర్తి, కొడవలి గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు మత్స్యకార సొసైటీగా ఏర్పడి చేపలు పెంచుకుని అమ్ముకుంటున్నారు. కాగా శనివారం ఆ మత్స్యకార సంఘం సభ్యులు చెరువులో చేపలు పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన మరో వర్గం వ్యక్తులు ఆ చెరువుపై తమకు హక్కు ఉందని గొడవకు దిగారు. దీంతో ఆదివారం ఉదయం ఇరు వర్గాలు చెరువు వద్దకు చేరుకుని చేపలు పట్టుకునే విషయంలో వివాదానికి దిగారు. ఇరు వర్గాల వారు వేర్వేరుగా టెంట్‌లు ఏర్పాటు చేసుకుని ఒకరిపై ఒకరు పంతాలకు పోయి దాడులకు తెగబడడానికి సిద్ధమయ్యారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత స్థానిక మత్స్యశాకాధికారి రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి అసలు చెరువుపై ఎవరికి హక్కు ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే పాత సంఘం గత రెండేళ్లుగా రెన్యువల్ చేయించుకోలేదని మత్స్యశాఖాధికారి చెప్పడంతో విషయం తేలే వరకూ ఏ వర్గ సభ్యులు చెరువు వద్దకు రావడానికి వీలు లేదని హుకుం జారీ చేశారు. అప్పటివరకూ పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందితో కాపలా కాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇరు వర్గాలు అక్కడి నుంచి వెళ్లి పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల వేలంపాటలు పెండింగ్‌లో ఉన్నాయని మత్స్యశాఖాధికారి రామకృష్ణ తెలిపారు. అధికారుల నిర్ణయంతో వివాదం సద్దుమణిగింది.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి, శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

గోకవరం: గ్రామంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుందని తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులు రూ.30 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడి వైద్యానికి సహకారం అందించిన శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ఎంపీపీ దంపతులు అభినందించారు. దాతలు ముందుకొచ్చి బాలుడి వైద్యానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఎస్ అలీషా, వాకచర్ల రవి, కట్టా సూర్యప్రకాష్ రావు, రామోజు దుర్గ, అద్దంకి వెంకటేశ్వరరావు, వంకా వీరబాబు, మైపాల సతీష్ నాగులకొండ భద్రరావు, బత్తుల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార సంఘాల ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. కాకినాడలోని సహకార శ్రీనిలయంలో ఆదివారం సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాజన సభ జరిగింది. ఉద్యోగులకు 2019 పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సహకార ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ధాన్యం కొనుగోలు వల్ల సహకార సంఘం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘాలకు ధాన్యం కొనుగోలు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. డీసీసీబీలో రుణాల మంజూరు జరుగుతున్న జాప్యంపై డీసీసీబీ సీఈఓ సంప్రదింపులు చేయాలని మహాజన సభలో తీర్మానించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదరబోయిన నరసరాజు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి అప్పలరాజు, కోశాధికారిగా ఎం.శివనాగు, ఎ.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పి.తమ్మయ్య, ఉప ప్రధాన కార్యదర్శుగా బి.రామన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి తోట వెంకటరామయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విదార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

- పెద్దాపురం డీఎస్పీ మురళీ మోహన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీ మోహన్

గండేపల్లి: విదార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతూ రామేశంపేట, సూరంపాలెం గ్రామాల్లోని 19 హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి పిల్లలను చదివిస్తుంటే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మెరుగైన జీవితాన్ని అవలంబించేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కళాశాలల వద్ద గాని, బయట గాని అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే పెద్దాపురం డీఎస్పీ 94907, 60768, జగ్గంపేట సీఐ 94407 96529, గండేపల్లి ఎస్సై 94409 04841 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్సై గణేష్ కుమార్, జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు, పెద్దాపురం ఎస్సై ఎస్‌కే అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

నూకాలమ్మ పూల గరగ ఉత్సవం



ఉత్సవానికి ఆలయంలో సిద్ధంగా ఉంచిన పూల గరగ

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల గరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ కమిటీ పర్యవేక్షణలో గరగలను ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారి పూల గరగను భక్తులతో కలిసి బయటలకు తీసుకువచ్చి ఆలయ ముఖద్వారం వద్ద గరగలను ఆడించారు. గ్రామంలో వీధివీధినా, గడపగడపకూ అమ్మవారి గరగను ఊరేగించారు. అనంతరం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, లక్కాకుల కృష్ణ, గంటా రామస్వామి, గ్రామ ఉప సర్పంచ్ జోకా నానాజీ, గవరసాని రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

175 మందికి గుండె వైద్య పరీక్షలు



తునిలో రోగులకు గుండె వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఉషా కార్డియాలజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ప్రారంభించారు. కార్డియాలజీ డాక్టర్ శ్రీనివాస్ తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 175 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా వైస్ చైర్మన్ నార్ల రత్నాజీ తెలిపారు. 40 ఏళ్ల దాటిన అందరూ క్రమం తప్పకుండా వ్యాయామం పాటు వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, నాయకులు చిక్కాల సీతారాం, బుద్దిగ దారేష్, కన్నూరి శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదస్థలంలో డివైడర్‌పై కారు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని మల్లేపల్లి శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, హైవే మెయింటినెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు వెళుతున్న కారు మండలంలోని మల్లేపల్లి శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్‌కే నాగూర్, షేక్ రఫీలు గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మెయింటినెన్స్ సిబ్బంది కారు నుంచి బయటకు తీసి హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతకుముందు గండేపల్లి శివారు రాయిచెరువు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ప్రమాదం వల్ల విశాఖ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.